అన్యోన్య దాంపత్యం

— యస్. జ్యోతినాథ్

ఒక్కసారిగా చెలరేగిన కరతాళ ధ్వనులకు ఉలిక్కిపడ్డట్టయి, చుట్టూ కలయజూసింది సరిత. అందరూ తమ వేపే దృష్టి కేంద్రీకరించి చప్పట్లు కొడుతున్నారు. 'ఏమిటి' అన్నట్టు భర్తవేపు అయోమయంగా చూసింది. మధుకర్ చిరునవ్వుతో భుజం మీద చెయ్యేశాడు – లేచి పదమన్న అర్థం వచ్చేలా కళ్ళతో సైగ చేస్తూ.

వేదిక మీద మైక్‌లో సెక్రటరీ కాబోలు అంటున్నాడు.

"ఈ 'అన్యోన్య దాంపత్యం' పోటీలో ప్రథమ జంటగా గెలుపొందిన శ్రీ మధుకర్‌గార్నీ శ్రీమతి సరితా మధుకర్‌గారినీ మరోసారి సంతోషంగా అభినందిస్తూ వేదిక మీదికి ఆహ్వానిస్తున్నాము. మా కార్యక్రమాన్ని జయప్రదంగా నిర్వహించిన ప్రేక్షకులకూ, న్యాయనిర్ణేతలకూ, పోటీ పెట్టిందే తడవుగా వుత్సాహంగా పాల్గొన్న అనేకమంది యువ దంపతులకూ మా కృతజ్ఞతాంజలులు'' ఈసారి చప్పట్లు మరింత హెచ్చు స్థాయిలో విన్పించడం మొదలెట్టాయి.

'అన్యోన్య దాంపత్యం!' అనుకుంది సరిత తనలో తనే నవ్వుకుంటూ. 'హూ! ఎంత అందమైన అబద్ధం....'

"రా సరితా! తాత్సారం చేస్తే బావుండదు.'' మధుకర్ కంఠంలో అసహనం తనకొక్కదానికే అవగతమవుతుంది. తల దించుకుని.... పైటకొంగుని భుజాల మీదుగా లాగి కప్పుకుంటూ మధుకర్ వెనకగా నడిచి వెళ్ళి వేదిక ఎక్కింది సరిత.

కార్య నిర్వాహకులలో ఒకరు ఆ దంపతుల గళసీమల్ని పుష్పమాలలతో అలంకరించారు.

మధుకర్, సరితా చేతులు జోడించి అందరికీ ఓసారి నమస్కారం చేశారు.

"మాకీ అవకాశం కల్పించిన పత్రికా సంపాదకులు రామనాథంగారికీ, సంస్థ సంస్థాపకులు గురుమూర్తిగారికీ, మమ్మల్ని ప్రథమ స్థానంలో నిలిపిన న్యాయనిర్ణేతలకీ, ఆహూతులైన నా తోటి సోదర సోదరీమణులకి నా కృతజ్ఞతలు'' అన్నాడు, మధుకర్ చిరునవ్వుతో.

బహుమతి ప్రదానానికి విచ్చేసిన గౌరవ అతిథి ఓ ప్రముఖ విద్యావేత్త.

పోటీ నిర్వహించిన ఓ ప్రముఖ పత్రికా, మరో సాంస్కృతిక సంస్థా ఆయన చేతుల మీదుగా తమ బహుమానాన్ని వారిరువురికీ అందజేసాయి.

కెమేరాలు క్లిక్‌మన్నాయి అన్ని వేపులనుండీ. ప్రేక్షకులు చూపులు తిప్పుకోలేకపోయారు.

'ఎంత అందమైన విలక్షణమైన జంట!' అనుకోకుండా వుండలేకపోయాయి కొన్ని వందల హృదయాలు. ఆరడుగుల నాలుగంగుళాల సమున్నత విగ్రహం మధుకర్‌ది. కొస్త ఎరుపు తెలుపు కలిసిన పచ్చని ఛాయ. ఆకర్షణీయమైన ముఖంలో ఆ ఆకర్షణకి మేమే మూలమన్నట్టు చూసే కళ్ళూ, ఠీవిగా ఎత్తుగా నిలిచిన ముక్కూ.... ఎప్పుడూ చిరునవ్వు చిందించే పెదవులు.

ఆవేళ ఫుల్‌సూటులో వున్నాడు మధుకర్.

సరిత గులాబీరంగు బెనారస్ చీర కట్టుకుంది. చీరమీద జరీ బుటాలు లైట్ల కాంతిలో తళుకులీనుతున్నాయి. అతి సాదా అయిన అలంకరణే అయినా, సరితలో దాగిన సౌందర్యానికి అది అడ్డు రావడంలేదు. చల్లని మెల్లని పిల్లవాయువూ, పౌర్ణమినాటి వెన్నెలా, నిర్మలంగా సాగే నదీ జలాలూ, ప్రభాతాన అరవిరిసిన రోజా పుష్పం.... ఇవి ఆమె అందానికి నిర్వచనాలు.

ఆ రాత్రి చిన్న వినోద కార్యక్రమం తర్వాత విందు భోజనం ఏర్పాటు చేశారు.

మధుకర్ నెరిగినవాళ్ళూ స్నేహితులూ ఒక్కొక్కళ్ళే వచ్చి తమ అభినందనలు తెలుపుకుంటున్నారు. మధుకర్ చిరునవ్వుతో కరచాలనం చేస్తున్నాడు. యాంత్రికంగా చేతులు జోడించి నమస్కారాలు చేస్తోందామె. ఆమె మనసు ప్రస్తుతం యిక్కడ లేనేలేదు. పురుషుల ఆరాధనాపూర్వకమైన చూపులుగానీ స్త్రీల ఈర్ష్యాపూరిత వీక్షణాలుగానీ ఏవీ ఆమెని స్పృశించడంలేదు.

'అన్యోన్య దాంపత్యం' అని నవ్వుకుంది ఆమె అంతరాత్మ.

రెండేళ్ళ క్రిందట పెళ్ళినాడు తమ జంటని చూసి పెద్దలేమిటి....పిన్నలేమిటి...స్నేహితులేమిటి బంధువు లేమిటి .... అంతా అదేమాట అన్నారు. పొంగి పోయింది తను. మధుకర్‌ని పెళ్ళాడడం తన అదృష్టం అనుకుంది. ఈ వివాహం తన జీవితంలో నూతన సౌరభాలను వెదజల్లుతుందనుకుంది. 'మీ అమ్మాయి కన్నివిధాల దీటైన అల్లుడిని సంపాదించావ్ విమలమ్మా!' అని అంతా అంటుంటే అమ్మ కళ్ళలో వెలుగులు తనెలా మర్చిపోగలదు?

నాన్న తమని అప్యాయంగా చూసుకుని కంట తడిపెట్టిన దృశ్యం తనెలా చెరిపేసుకోగలదు? అత్తగారు తన బుగ్గలు పుణికి, 'మొత్తం మీద మావాడు తగిన పిల్లనే ఎన్నుకున్నాడు.' అని అనేసరికి తన హృదయం పురి విప్పిన నెమలే అయింది.

"మిమ్మల్నిద్దర్నీ చూస్తుంటే ఒకరికోసం మరొకరు పుట్టారేమో అనిపిస్తోంది సరితా!'' అంది తన ప్రాణంలో ప్రాణం లాంటి స్నేహితురాలు

వరూధిని, తను మధుకర్ వెంట ఈవూరు వచ్చేసే రోజున. పెళ్ళయిన నెల రోజులు కలలో లాగా గడిచిపోయాయి.

"సరితా! ఏమిటి అలా స్తంభంలా నించుని ఆలోచిస్తున్నావ్? పద. వెళ్దాం" మధుకర్ పిలుపు సరిత నీ లోకంలోకి లాగింది.

మధుకర్! పేరులో మధురిమలు దాచుకున్న మధుకర్ మాటల్లో స్వారస్యం అది!

మౌనంగా వెళ్ళి అతని వెనకగా స్కూటర్ మీద కూర్చుంది సరిత.

ఇంటి కెళ్ళి చీర మార్చుకుంటుంటే, మధుకర్ చేతులు భుజాల మీదుగా వచ్చి చుట్టేశాయి.

"నా కెంత సంతోషంగా వుందో తెలుసా ఇవ్వాళ? నీకో పచ్చలసెట్.... అయిదు వేలు కాష్ ఇచ్చారు. ఎన్నాళ్ళనుండో ఫ్రిజ్ కొనుక్కుందా మన్న ఆలోచన వుంది. రేపే వెళ్ళి కొందామను కుంటున్నాను."

మృదువుగా అతని చేతులు తప్పించుకుంటూ వెళ్ళి చీరను బీరువాలో పెట్టి వెనక్కి తిరిగి అంది సరిత. "పోనీ....మన స్కూటరు బాపతు యింకా మూడు వేలకు పైగా తీర్చాల్సింది వుంది గదా.... అది తీర్చండి."

మధుకర్ ముఖంలో రంగులు మారాయి.

"చూద్దాంలే" అన్నాడు మామూలుగా.

రెండేళ్ళ వైవాహిక జీవితంలో సరితకి అతని ఉద్దేశం బాగానే తెలుసు. ఆ 'చూద్దాంలే' అన్న దానికి చేయడనే అర్థం అని.

నెమ్మదిగా వెళ్ళి మంచం మీద వాలిపోయింది. లైటార్పి, ఆమెని తన వేపు తిప్పుకున్నాడు మధుకర్.

*

మర్నాడు పేపర్లో వచ్చింది తమ ఫోటో. సిగ్గుగా అన్పించింది సరితకి. చాలా దగ్గరగా హత్తు కుని నిల్చున్నట్లు తీయించుకున్నారు యిద్దరూ.

మధుకర్ ప్రొద్దున్నే టిఫిన్ తిని డ్యూటీకెళ్ళాడు. ఇక రావడం మధ్యాహ్నం లంచికే.

రాత్రి బాగా ప్రొద్దుపోయి నిద్రపోవడంతో సరితకి ఒళ్ళంతా నెప్పులుగా తగని నీరసంగా వుంది.

ఎలాగో అలా వంట పూర్తిచేసి విశ్రాంతిగా పడుకుంది.

"అక్కా! ఫోనొచ్చింది." ఎదురింట ఉమ వచ్చింది యింతలో.

"ఎవరమ్మా?" లేచి వెళ్తూనే అడిగింది సరిత.

"బావగారేనక్కా!"

"హలో సరితా!" మధుకర్ ఉత్సాహంగా పిలిచాడు అవతలనుండి. "చూడూ...మా ఫ్రెండ్స్ పార్టీపార్టీ అని గోలపెట్టేస్తున్నారు. పరేననక తప్పలేదు. లంచ్‌కి ఏర్పాట్లు చెయ్యి. ముఖ్యమైన వాళ్ళే అయిదారుగురు వస్తారు. ఓకే?"

"లంచ్‌కా?" నీరసంగా అంది సరిత. మధుకర్‌కి నాలుగైదు ఆదరువులు కావాలి స్నేహితుల్ని పిలిస్తే. ఏదో సింపుల్‌గా చేస్తే సరిపెట్టుకోలేడు.

"మరో రోజు పిలవదా? ఇవ్వాళ కాస్త నలతగా...." సరిత మాట పూర్తికానే లేదు—

"ఇవ్వాళ పిలిచాక బావుండదు. ఎలాగో అలాగ చేసెయ్యి." అవతల ఫోను పెట్టిన ధ్వని.

ఆ కంఠంలోని అధికారానికి సరిత ఒళ్ళు ఎప్పటి కప్పుడు జలదరిస్తూనే వుంటుంది.

'చెయ్యగలవా?' అన్న అభ్యర్థన అతని నోటి

గుండా ఒక్కనాడైనా వినలేదు తను. చెయ్యి.... చేసెయ్యి? అన్న ధోరణే అతనిది.

వంట చేయడం తనకి కష్టం కాదు. కాని ముందుగా తను చేయగలదో లేదో అన్న ఆలోచన లేదు మధుకర్‌కి. ఆహ్వానించడం తన ప్రమేయం లేకుండా చేసేసి, ఆ తర్వాత తనని పరుగు లెత్తిస్తాడు. భార్య కూడా ఓ మనిషే.... ఆమెకీ మనసుంటుంది. బొత్తిగా యంత్రం కాదు అని అతను నేర్చుకున్న చదువు బోధించలేదా?

బజారు కెళ్ళి కూరలు తెచ్చి మళ్ళీ వంట మొదలెట్టింది సరిత.

లంచ్‌కి ఓ అరడజనుమందిని వెంటపెట్టుకుని వచ్చాడు మధుకర్.

ఛలోక్తులతో, నవ్వులతో భోజనాలు ముగించి వాళ్ళు వెళ్ళేసరికి సరిత ప్రాణం కడబట్టినంత పనయింది. నీరసంగా అన్నం తిని వెళ్ళి పడుకుంది.

మళ్ళీ కాలింగ్‌బెల్ ధ్వనికిగాని మెలకువ రాలేదు. లేచి వెళ్ళి తలుపు తీసింది.

"ఏమిటా మొద్దునిద్ర వేళగానివేళ? అంత అలసిపోయే పనులేం చేస్తున్నావ్ యింట్లో? డర్టీ అవతారమూ.... నువ్వూను.... తల పగిలిపోతోంది. కాస్త కాఫీ తగలెయ్యి. నా మొహాన." విసురుగా అంటూ వచ్చి కుర్చీలో కాళ్ళు బారజాపుకుని కూర్చున్నాడు మధుకర్.

మాట్లాడేందుకు కూడా ఓపికలేనిదానిలా వెళ్ళి ముందుగా కాఫీకి నీళ్ళు పడేసింది సరిత. అవి మరిగే లోపుగా ఆ ప్రక్కనే వున్న వాష్ బేసిన్‌లో గబగబా ముఖం కడుక్కుని పైట చెంగుతో తుడుచుకుంది.

'అదేమిటి సరితా. అలా వున్నావ్? ఒంట్లో బాగాలేదా?' అని ఆప్యాయంగా అడగకూడదా మధుకర్.... అని ఎన్నోసార్లు అన్పిస్తుంది సరితకి. అలాగని మధుకర్ తనకనారోగ్యంగా వుంటే పూర్తిగా అలక్ష్యం చేస్తాడని కాదు. డాక్టరుని పిలిచి, మందులు కొనీ నానా హైరానా పడతాడు. కాని అదేదీకాదు తనకి కావల్సింది. బహుశా తనే మధుకర్‌పట్ల సరియైన అవగాహనతో లేదా అంటే- ఏమో. మాటే దురుసుగా... మనసు బాధపడేలా వుంటే.... కనపడని అతని మనసులో నవనీతం వుందని ఎలా అనుకోగలదు?

రెండు కప్పుల్లో కాఫీ కలిపి తీసుకెళ్ళి అతని కెదురుగా కూర్చుంది.

"మధ్యాహ్నం లంచ్ చాలా బాగా కుదిరా యన్నారు సరితా! భలే పొగిడారు నిన్ను. 'అన్యోన్య దాంపత్యం' అన్నది మన విషయంలో నూటికి నూరుపాళ్ళూ నిజంట." కాఫీ సిప్ చేస్తూ నవ్వుతూ అన్నాడు మధుకర్.

చిరునవ్వే సమాధానమైంది సరితకి.

'అది కేవలం రూపం విషయంలోనే.' అందామె మనసు.

ఎంత అందమైన రూపం మధుకర్‌ది! కాని కేవలం ఆ రూపంతో సరిపెట్టుకోలేకపోతోంది తను. అతను తనకేవిధమైన లోటూ చెయ్యడు. అడగకముందే లేటెస్ట్ ఫాషను చీరలూ.... కాస్మెటిక్స్ ఏర్పాటు చేస్తాడు. నిజానికి పుట్టింట్లో కన్నా యిక్కడే సుఖంగా వుంది. కాని సుఖానికీ సంతోషానికీ మధ్యనున్న ఓ పలుచని తెర తన మనసుని కలవరపెడ్తోంది.

"ఏమిటా పరధ్యానం? ఇవ్వాళ ప్రభు డిన్నర్ ఏర్పాటు చేశారు. వెళ్ళాలి."

మధుకర్ మాటలు విన్పించి, ఖాళీ కప్పుని బల్లమీద పెడ్తూ అడిగింది సరిత. "ఎందుకు?"

"ఎందుకేమిటి సిల్లీ.... మనం పోటీలో ప్రథమ జంటగా గెలిచాం అది గుర్తుందా నీ మొద్దు బుర్రకి? ఇంకో వారం యిలాగే డిన్నర్లూ పార్టీలూ వుంటాయి...." పెద్దగా నవ్వాడు మధుకర్.

ఆ రాత్రి డిన్నర్ పార్టీ గ్రాండ్‌గా జరిగింది. మధుకర్, సరితా పార్టీలో సెంట్రల్ ఎట్రాక్షన్ అయ్యారు.

మధుకర్ అన్నట్టే ఆ వారమంతా ఎవరో ఒకళ్లు తమ యిళ్ళకి ఆహ్వానిస్తూనే వున్నారు. అభినందనలు తెలుపడానికి వచ్చేవాళ్ళు కొంతమంది. సరితకి వూపిరాడని పని ఆ వారమంతా.

*

మధుకర్, సరితల విజయం పాతబడింది కాస్త. సరితకిన్నాళ్ళకి తీరికంటూ దొరికింది. ఫ్రెండ్సూ, చెల్లెళ్ళూ, తలిదండ్రులూ రాసిన వుత్తరాలు చదువుతూ కూర్చుంది. అంతా పేపర్లో చూసి అభినందనలు తెలుపుతూ రాశారు.

"బావగారు భలే హేండ్‌సమ్‌గా వున్నారక్కయ్యా ఫొటోలో. నువ్వేమిటలా 'సతీ సావిత్రి' మొహం పెట్టావ్ ఠీవిగా పెట్టక?" అని రాసింది పెద్దచెల్లెలు భారతి.

"నాన్నగారు చాలా ముచ్చట పడ్డారమ్మా మీ ఫొటో చూసి. ఆ సంతోషంలో నన్ను కాస్త హాస్యం చేశారు కూడా.... మా పెళ్ళినాడు తన స్నేహితులంతా అన్నారట.... కాకి ముక్కుకి దొండపండులా వుందిరా మీ జంట అని. ఇంతకీ కాకి ఎవరు? దొండపండెవరు? అని అడిగాను మీ నాన్నగార్ని. 'అదే అడగడం మరిచిపోయాను.' అన్నారు. మీ నాన్న సంగతి నీకు తెలిసిందేగా...."

తల్లి రాసిన ఉత్తరం సరితకి నవ్వు తెప్పించింది.

నాన్న ఒక్కనాడు కోపంగా ప్రవర్తించడం తామెరుగరు. పిల్లల్లో పిల్లవాడిగా కలిసిపోయే వారు. ఊహ తెలిశాక అమ్మకీ నాన్నకీ మధ్య మాటా మాటా రావడం చూడలేదు తను. ఫలానాది యిష్టం లేదనిగానీ.... యిష్టం అని గానీ అమ్మ నోరు విడిచి చెప్పేది గాదు. అసలా అవకాశమే కలగకుండా మనస్సెరిగి పనులు చేసేవాడు తండ్రి. అభిరుచులూ అభిప్రాయాలూ వేరైనా ఒకరి నొకరు మన్నించుకుంటూండేవారు. ఏ భయ్యో పడిలో పడినా, తల్లిపట్ల అనురాగాన్ని సున్నితంగా వ్యక్తపరచే తన తండ్రి కళ్లు తనకి పదే పదే గుర్తు వస్తుంటాయి. ఆ ప్రేమకి సూత్రం బాహ్య ఆకర్షణ మాత్రం కాదు. తండ్రితో పోలిస్తే అమ్మ పెద్ద అందగత్తేమీకాదు. సన్నగా పొట్టిగా సామాన్య రూపురేఖలతో వుండే అమ్మ, భారీగా, చూడగానే అందగాడనిపించే తన తండ్రిని ఏ విధంగా మెప్పించగలిగింది?

ప్రియమైన సరితా,

ఉత్తరం రాసి పడేస్తేగాని వూరుకోనంటున్న మనస్సుని అదుపులో పెట్టలేక యిన్నాళ్ళకి పలకరిస్తున్నాను. కోపం తెచ్చుకోకు నీ వరూ మీద. ఎంత బావుందో మీ జంట? వెంటనే నాకు తోచిన దృష్టి తీసేశాను, మీ ఇద్దరికి. ఫొటోలో-మామూలుగా కన్నా బాగా పడ్డావ్. కాస్త ఒళ్ళు కూడా చేసినట్టుంది. ఏమన్నా విశేషమా పిల్లా? శ్రీ మధుకర్ గారెలా వున్నారు? పెళ్ళినాడు పందిరంతా ఏకం చేసి పారేసిన యీ వరూధిని గుర్తుందా ఆయనకి? భలే అదృష్టవంతురాలివి సరితా. అన్నివిధాలా దీటైన భర్త దొరకడం స్త్రీకి వరం సుమా. నా హృదయపూర్వక అభినందనలు స్వీకరించు మరి.

నీ-వరూ.

వరూధిని రాసిన ఉత్తరం మళ్ళీ మళ్ళీ చదువుకుంది సరిత. తనకీ, వరూకీ ఉత్తర ప్రత్యుత్తరాలు తక్కువే మంచి స్నేహమైనా.

చిన్న వుత్తరమైనా అభిమానమంతా వ్యక్తపరిచింది వరూధిని.

'వరూ! నేనెలా చెప్పనే నా బాధ? చెప్పినా నీకర్థమవుతుందా? కొట్టి పారేస్తావా వుత్తదే అని.' కుర్చీలో వెనక్కి వాలి అనుకొంది సరిత.

కొన్ని నిమిషాల తర్వాత ఏమన్పించిందోగాని లేచి వెళ్ళి కాగితం కలం తెచ్చుకొని రాయడం మొదలెట్టింది.

వరూ డియర్,

నీ ఉత్తరం చూడగానే ఎదురుగా నిల్చుని మాట్లాడినట్లే ఫీలయ్యానంటే నమ్ము. ఏం చేస్తున్నావ్ ఆ కలకత్తా మహానగరంలో? మా వారి గురించి అడిగావ్‌గాని, మీ శ్రీవారి కబుర్లు విన్పించలేదేం?

నీ అభినందనలు స్వీకరిస్తున్నాను. ఏదో సరదాగా ఫొటో పంపారు. గెలుస్తాం అన్న ఆలోచనే లేదు. అంతా తమాషాగా జరిగింది.

నేను అదృష్టవంతురాలని అన్నావ్. నేనూ అలాగే అనుకున్నానే వరూ పెళ్ళినాడు. కాని ఆ భావన ఎంతో కాలం నిలవలేదు నా మనసులో. అది నా బలహీనతే అంటారేమో మరి....ఎందుకో నా మనస్సు విప్పి ఎవరితోనన్నా చెప్పుకోవాలన్పిస్తోంది. దాదాపు పదేళ్ళు మనమిద్దరం ఒకే మనసుగా, ఒకే ప్రాణంగా మసిలాం. నీకన్నా ఎవరున్నారు చెప్పుకునేందుకు?

వైవాహిక జీవితంలో ఆకర్షణకన్నా అతీతమైన భావన ఏదో వుంది అనేదానివి గుర్తుందా? అది నిజమన్పిస్తోంది వరూ!

మధుకర్ అందమైనవారు. చదువుకున్నారు. కాని....కాని....నాకు కావల్సింది అదికాదు వరూ! భర్తకీ, భార్యకీ మధ్య ఓ సుహృద్భావం ఓ సదవగాహన. అదే లోపించింది మాలో. నా అలవాట్లనూ, అభిరుచుల్నీ తెగ హేళనచేసేవారు పెళ్ళయిన కొత్తలో. మొదట బాధపడేదాన్ని. తీవ్రంగా ఎదురు తిరిగేదాన్ని. పర్యవసానం తీవ్రమైన వాతావరణం. తర్వాత తర్వాత రాజీపడడం మొదలెట్టాను. కాని ఎన్నాళ్ళు రాజీపడను? జీవితం ప్రతిసారీ నేనే రాజీపడడంతో నిస్సారంగా అన్పిస్తోంది. ఆయనది దురుసైన స్వభావం. మాటలు తీవ్రంగా వస్తాయి. పశ్చాత్తాపపడినట్లు కూడా కన్పించరు. ఏకాంతంగా వున్న సమయాల్లో కూడా ఆయన ప్రవర్తనలో ఆప్యాయత కన్నా అధికారమే కన్పిస్తుంది. చల్లని మాటా, సేదదీర్చే హృదయమూ లేవు ఆయనలో. ఆ అందం వెనుక దేవుడు అంత కాఠిన్యం దాచాడేమిటి?

'అన్యోన్య దాంపత్యం' పోటీలో బహుమతి రావడం తల్చుకుంటుంటే నవ్వు వస్తోంది. పాపం! వాళ్ళు మాత్రం ఏం చేస్తారు? వాళ్ళ కళ్ళకి కన్పించిన దానికి విలువకట్టడం తప్ప! మధుకర్, నేనూ ఒకళ్ళకోసం మరొకళ్ళం పుట్టామేమో అన్నంత యిదిగా కన్పిస్తాం గదూ! మా హృదయాల్లోకి తొంగిచూసేంత శక్తి ఎవరికన్నా వుంటే, వాటి మధ్య గల దూరాలు గోచరిస్తాయి. నిజం వరూ! రెండేళ్ళ బాధ యిది.

'అన్యోన్య దాంపత్యం' బహుమతిని నేనే అందజేయాల్సివస్తే తప్పకుండా మా అమ్మా నాన్నలకి అందజేస్తాను. ఆ అన్యోన్యత 'అనితర సాధ్యమన్పిస్తుంది నాకు.

ఒకళ్ళ అభిప్రాయాలను మరొకరు గౌరవిస్తూ, ఒకళ్ళ అభిరుచుల్ని మరొకరు మన్నిస్తూ, పాలూ నీళ్ళలా, ఆకూ వక్కలా కలిసిపోయే దాంపత్యం నాకీ జన్మలో ప్రాప్తంలేదు వరూ!

నా కడుపులో బాధ విప్పి చెప్పినందుకు ఏమనుకుంటావో మరి? ఉంటాను.

నీ సరిత.

సరిత కళ్ళు ధారగా వర్షిస్తున్నాయి.

ఉత్తరంలో ఒక్కొక్క అక్షరమే ఆ కన్నీటితడికి కరిగిపోతోంది.

'ఎవరికి చెప్పుకున్నా నా బాధ తీరేదికాదు. వాళ్ళకి నా విషయంలో వున్న సదభిప్రాయం పోగొట్టుకోవడం ఎందుకు?' అనుకుంది సరిత, అక్షరాలు దిద్దే ప్రయత్నం మానుకుని. □

పాఠకులకు:

"చిత్రానికి కథ"

ఇక్కడ ఒక చిత్రం కనిపిస్తోంది. ఆ చిత్రాన్ని చూసి, మీరు దానికి తగ్గట్టుగా ఏదైనా చిన్న 'కథ' అల్లగలరా? కథలో చమత్కారం వుంటే మరీ మంచిది. ఏమైనా, తావు సైజులో పేజీకి మించి రాయకూడదు. అలా రాసి, ఆ కథల్ని 'చిత్రానికి కథ' అన్న పేరిట మార్చి 7వ తేదీలోగా మాకు చేరేలా పంపాలి. అన్నింటికంటె: బాగున్నదనిపించిన కథ రాసిన వారికి 'ఉపయోగపడే చక్కని బహుమతి' పంపుతాము. ఫలితం: ఏప్రిల్ సంచికలో